## ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న కృష్ణమూర్తి

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న సీహెచ్. కవిత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. భర్త కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేకపోవటంతో డిపో సిబ్బంది ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లు కలిసి రూ. 1.27 లక్షలు ఆదివారం డిపో మేనేజర్ కృష్ణమూర్తి చేతుల మీదుగా కవితకు అందజేశారు. తోటి ఉద్యోగికి సహాయం చేసిన సిబ్బందిని డీఎం అభినందించారు.

## వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు నిర్వహించుకుంటున్న రఘువీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: మన్సూరాబాద్ ప్రభుత్వ పట్టణ ఆసుపత్రి పక్కన రైట్ నక్షత్ర హాస్పిటల్స్, శ్రీరత్న క్లీనిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని మన్సూరాబాద్ బీఆర్ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. వైద్యశిబిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## టీజేఎస్‌లో చేరిక



రమణకు కండువా కప్పుతున్న కోదండరామ్

మలక్‌పేట: తెలంగాణ విద్యావంతుల వేదిక సీనియర్ నేత పగడాల రమణ తెలంగాణ జన సమితిలో చేరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరామ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ లక్ష్యాలను ప్రజల దగ్గరకు తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## ప్రజల మన్ననలు పొందాలి



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సీఐ మురారి

చాదర్‌ఘాట్: పోలీస్ డ్యూటీ కత్తిమీద సాము లాంటిదని ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ మురారి అన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న బోయ శ్రీనివాస్ బదిలీపై బంజారాహిల్స్ పీఎస్ వెళ్తున్న సందర్భంగా సీఐ ఆధ్వర్యంలో ఆయనకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల మన్ననలు పొందేలా విధులు నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఐ బాలగోపాల్, ఎస్సైలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మెడికల్ రీయింబర్స్‌మెంట్ పెంచాలి

చాదర్‌ఘాట్: రిటైర్డ్, ప్రస్తుత ప్రభుత్వ ఉద్యోగులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని పెంచాలని రాష్ట్ర పెన్షనర్స్ అసోషియేషన్ సభ్యుడు, రిటైర్డ్ తహసీల్దార్ ఖాజాషబ్బీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిటైర్డ్ అయిన ఉద్యోగులు అనారోగ్యంతో చికిత్స పొందితే రూ. లక్షల్లో ఖర్చు అవుతున్నా రాష్ట్ర మెడికల్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ద్వారా రూ. 75 వేలే మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## విహారయాత్రలకు ప్రత్యేక బస్సులు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ సిటీ డిపో నుంచి పుణ్యక్షేత్రాలు, విహారయాత్రలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామని మేనేజర్ సమత తెలిపారు. భూక్లైలాస్ దేవాలయం, కోట్‌పల్లి ప్రాజెక్ట్, బుగ్గ రామేశ్వరం దేవాలయం, అనంతగిరిలోని అనంత పద్మనాభ స్వామి దేవాలయం వరకు ఉంటాయన్నారు. ఈ నెల 27న ఉదయం 5.50 గంటలకు బయలుదేరి సాయంత్రం 7 గంటల వరకు తిరిగి డిపోకు చేరుకుంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 7989928321, 9063102132, 8247381525 నంబర్లలో సంప్రదించాలన్నారు.

# వరద ముంపు తప్పేదెలా?

- రెండేళ్లుగా సాగుతున్న వరద కాలువ పనులు
- రాచకాలువపై అక్రమ నిర్మాణాలే పనులకు అడ్డంకి?



బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో బృందావన్‌మేడోస్ కాలనీ వద్ద నిలిచిన వరద కాలువ పనులు



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో రాచకాలువను సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్)

ఎల్‌బీనగర్: శాఖల మధ్య సమన్వయలోపంతో రెండేళ్లైనా వరదకాలువ పనులు ముందుకు సాగడం లేదు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి వరద ముంపు ఉన్న కాలనీల విముక్తి కోసం సుమారుగా రూ. 2 కోట్లతో నిర్మించే వరద కాలువ పనులు సగం ముందుకు సగం వెనక్కి సాగుతున్నట్లుగా ఉంది. ఈ సారైనా తమ కాలనీలకు వరద ముంపు నుంచి విముక్తి లభిస్తోంది అనే ఆశతో ఎదురు చూస్తున్న కాలనీవాసులకు నిరాశనే మిగిలింది. వానాకాలం వచ్చిందంటే చాలు..ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో పలు కాలనీ ప్రజలు మంపు భయంతో బిక్కుబిక్కుమంటు గడుపుతుంటారు. నాలాలు, కాలువలు, డ్రైనేజీ పొంగుతుండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో ఇరిగేషన్, రెవెన్యూ, వాటర్ వర్క్స్, టౌన్ ప్లానింగ్ అధికారుల రాచకాలువను సర్వే చేసి హద్దులు సైతం నిర్ధారించినా పనుల్లో మాత్రం ఎలాంటి చలనం లేకుండా పోతుందని ఆయా ప్రాంతాల వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### యథేచ్ఛగా ఆక్రమణలు

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో కప్రాయి చెరువు నుంచి కిందికి వరద నీరు పారే రాచకాలువను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు.కాలువపై నిర్మాణం చేసిన కట్టడాలను కూల్చితేనే వరద కాలువ పనులు సాఫీగా సాగుతాయి. అలాంటి కాలువపై నిర్మాణాలు కూల్చకుండా కాలువ పనులను ఎలా చేయాలని పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులను ఆపేశారు. ఇరిగేషన్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో రాచకాలువ యథేచ్ఛగా ఆక్రమణలకు గురైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### మునిగే కాలనీలు ఇవే..

వరద కాలువ పనులు జరిగితే ఇక ముంపు సమస్య ఉండదని భావించిన కాలనీ వాసులకు మధ్యలో ఆగిన కాలువ పనులపై ఆందోళన చెందుతున్నారు. నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం, అంతర్గత డ్రైనేజీలో పూడికతీత చేపట్టకపోవడం ముంపు ముప్పు మరింత పెరుగుతోంది.మామూళ్లకు తలగ్గొడం, రాజకీయ ఒత్తళ్లు తదితర కారణాలతో కాలువపై నిర్మించిన ఆక్రమణలను తొలగించలేకపోతున్నారని పలువురు వాపోయారు. వర్షాకాలం వస్తే జక్కిడిరామస్వామికాలనీ, భవానీకాలనీ, ఏపీఆర్‌కాలనీ, బృందావన్‌మేడోస్ కాలనీ, మహాలక్ష్మీనగర్ కాలనీలకు మునక తప్పదని భయాందోళన చెందుతున్నారు.

### హైడ్రాకు ఫిర్యాదు..

రాచకాలువపై చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని హైడ్రాకు ఫిర్యాదు చేశామని ఇరిగేషన్ ఏఈ సతీష్ తెలిపారు. తాము చేసిన ప్రయత్నాలకు ఆక్రమణదారులు అడ్డుపడుతున్నారని అందుకే వరద కాలువ పనులు ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు. దీంతో గత్యంతరం లేక ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేశామని, త్వరలోనే హైడ్రా అధికారులు పర్యటించి కాలువను పరిశీలిస్తారని పేర్కొంటున్నారు.

## సంగీతం సర్వరోగాల నివారిణి



మాట్లాడుతున్న రామచంద్రరావు

దిల్‌సుఖ్‌నగర్: సంగీతం సర్వరోగాలను మాయం చేసే దివ్య ఔషధమని లయన్ డాక్టర్ ఎస్.రామచంద్రరావు పేర్కొన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎస్.ఆర్.ఆర్. చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా శనివారం రాత్రి కవి సమ్మేళనం, సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రముఖులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామచంద్రరావు, బీజేపీ జాతీయ నాయకులు పేరాల శేఖర్ రావు, ఏబీవీపీ మాజీ ప్రెసిడెంట్ డాక్టర్ పి.మురళీ మనోహర్ మాట్లాడుతూ.. సంగీతం అనేది మనుషులు ప్రకటించే గొప్ప అంశమని సంగీతానికి జాతి,కుల,మత, ప్రాంత, భేదాలు లేకుండా మనుషులను కలిపే శక్తి ఉంటుందన్నారు. అనంతరం ప్రతిభా పురస్కార గ్రహీతలు శుభాకర్ రావు, డాక్టర్ ఆమంచ అంజయ్య, జి.ఎల్. వీరాంజనేయులు, ఎల్.అనురుద్రరెడ్డి, డాక్టర్ బి.గంగాధర్ రెడ్డి, ఎ.మధుసూదన్, లయన్ డాక్టర్ మేడిశెట్టి వెంకటేశ్వర్లును సన్మానించారు.

## సన్మానం



సత్యనారాయణ చారిని సన్మానిస్తున్న దృశ్యం

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ఉత్తమ పోలీస్ మెడల్ పురస్కారం అందుకున్న రిటైర్డ్ పోలీస్ అధికారి అందోజు సత్యనారాయణ చారిని ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌చారి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చేతుల మీదుగా పురస్కారం అందుకోవటం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహచారి, రాధాకృష్ణ, చంద్రమౌళి, వాణి పాల్గొన్నారు.

## బడిబాటకు స్పందన.. పెరిగిన అడ్మిషన్లు

డిప్యూటీ డీఈఓ అన్వ్ర ఫాతిమా



చాదర్‌ఘాట్: బడిబాట కార్యక్రమానికి స్పందన వస్తోందని అంబర్‌పేట డిప్యూటీ డీఈఓ అన్వ్ర ఫాతిమా అన్నారు. ఆదివారం మలక్‌పేటలోని బధిరుల పాఠశాలలో ఆమె మాట్లాడుతూ.. మండలంలో ఉన్న 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కొత్త అడ్మిషన్లు పెరగడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు.

| పాఠశాల పేరు | ఈఎం | టీఎం | యూఎం |
|---|---|---|---|
| జీజీహెచ్‌ఎస్ హైదరాబాద్ | 35 | 04 | 11 |
| జీహెచ్‌ఎస్ ఎస్‌టీ పీటర్స్ | 50 | - | - |
| జీహెచ్‌ఎస్ విద్యాలయ | 24 | - | - |
| జీబీహెచ్‌ఎస్ కాచిగూడ | 36 | 03 | - |
| జీహెచ్‌ఎస్ అజంపురా-1 | 50 | - | - |
| జీహెచ్‌ఎస్ అజంపురా-2 | - | - | 16 |
| జీబీహెచ్‌ఎస్ ఓల్డ్‌మలక్‌పేట | 22 | - | 21 |
| జీజీహెచ్‌ఎస్ అంబర్‌పేట | 04 | - | 08 |
| జీబీహెచ్‌ఎస్ అంబర్‌పేట | 13 | - | - |
| జీజీహెచ్‌ఎస్ గోషామహల్ | 31 | - | 05 |
| జీహెచ్‌ఎస్ అంబర్‌పేట | 60 | 01 | 31 |
| జీహెచ్‌ఎస్ సీపీఎల్ అంబర్‌పేట | 130 | - | - |
| జీహెచ్‌ఎస్ డెఫ్ మలక్‌పేట | 13 | - | - |

## కాలనీల్లో సమస్యలను పరిష్కరిస్తాం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్ గడ్డం ఎన్‌క్లేవ్, హనుమాన్‌నగర్ కాలనీల్లో ఆదివారం ఏఐసీసీ విచార్ విభాగ్ కో–ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైనేజీ అవుట్ లెట్ లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కాలనీవాసులు ఆయన దృష్టికి తెచ్చారు. పార్కులు అభివృద్ధికి నోచుకోవడం లేదని, వీధిలైట్లు, తాగునీటి సరఫరాలో జాప్యం ఉందని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. మాజీ మేయర్ పారిజాత దృష్టికి తీసుకెళ్లి కాలనీల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో హనుమాన్‌నగర్ కాలనీ అధ్యక్షుడు నర్సింహాగౌడ్, కృష్ణ, రంజిత్‌రెడ్డి, రాజు, లచ్చిరెడ్డి, నాగిరెడ్డి, జంగారెడ్డి, రాకేశ్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

## సెల్‌టవర్ ఏర్పాటుపై నిరసన

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ గ్రామంలో జనావాసాల నడుమ సెల్ టవర్ ఏర్పాటు చేయడంపై స్థానిక ప్రజలు ఆదివారం నిరసనకు దిగారు. మామిడిపల్లి రోడ్డులోని చార్మినార్ మజీద్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ విషయమై మున్సిపల్, పోలీస్ అధికారులకు కూడా ఫిర్యాదు చేశామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలోని ఓ గ్రామంలో తీసుకున్న అనుమతుల పత్రాలను ఫోర్జరీ చేసి అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నా వారిలో చలనం లేదన్నారు. ఇళ్ల నడుమ ఏర్పాటు చేస్తున్న ఈ టవర్ నుంచి రేడియోధార్మిక శక్తితో సంతాన సమస్యలు, హృద్రోగ సమస్యలు తలెత్తుతాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ ప్రోద్భలంతోనే రాత్రికి రాత్రి ఈ టవర్‌ను ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. కాగా ఈ టవర్ విషయమై మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్, జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు.

## రైతు బజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు..
టమాటా రూ.21, వంకాయ రూ.23, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.50, కాకరకాయ రూ.42, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.37, దొండ రూ.23, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.22, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.65, చామగడ్డ రూ.28, మునగ రూ.80, కందగడ్డ రూ.35, బీట్‌రూట్ రూ.30, కీర రూ.33, బీన్స్ రూ.90, క్యాప్సికమ్ రూ.85.
ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌గఢ్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

**ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు..**

లక్ష్మీనగర్ క్రాస్‌రోడ్, రామాలయం, వాణీనగర్, పటేలమ్మ మడిగె, ఆనంద్ బిస్కెట్ ఫ్యాక్టరీ, ధోబీ ఘాట్ రోడ్, గుడ్డిబౌలి, చంచల్‌గూడ, జాంజాం మెడికల్ హాల్, మదీనా మజీద్, రహ్మానియా మజీద్, ఏక్ ఖానా మజీద్, గరల్స్ స్కూల్, మెహ్రాజ్ మజీద్, సీ క్వార్టర్స్, ముంతాజ్ కాలేజ్ క్రాస్ రోడ్, హనుమాన్ టెంపుల్, తలాబ్‌కట్ట మెయిన్‌రోడ్, ఫతేషా మజీద్, బన్నాక, క్యూబా మజీద్, బీబీ బజార్, జాఫ్రి గల్లీ, మౌలా కా చిల్లా, హస్మీ హోటల్, చమేలికా మండువ, హుస్సేన్ కోటి, రహ్మానియా మదర్సా పరిసర ప్రాంతాలు.

**మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు..**

భూలక్ష్మీనగర్, తిరుమలహిల్స్, గడ్డిఅన్నారం, కళ్యాణ్‌నగర్, కుర్మగూడ, అజీమ్ సైకిల్ ఫ్యాక్టరీ, చాప్‌నీ, 82 బస్‌స్టాప్, బాఫే జారా, యాకత్‌పురా నాలా, ఆస్మాన్‌గఢ్, వెంకటాద్రి నగర్, గడ్డిఅన్నారం, ఆర్‌బీ కాలనీ, సిటీ పర్ల్స్, ధర్మవంత్ కాలేజ్, గంగానగర్ నాలా, చలిసా మైదాన్, యాకుత్ మహల్ థియటర్, సిల్కీ ఐస్‌క్రీం, నాలా, మోతీ మజీద్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

## రిజిస్ట్రేషన్లపై ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

వనస్థలిపురం: వనస్థలిపురం కమలానగర్, ఆంధ్రకేసరినగర్ కాలనీలలో రిజిస్ట్రేషన్లపై విధించిన స్టేటస్ కోను ఎత్తివేయించినట్లు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు వేసిన కేసుల కారణంగా సాహెబ్‌నగర్ సర్వే నెం. 2 నుంచి 8 వరకు స్టేటస్ కో విధిస్తూ ఇటీవల ఇబ్రహీంపట్నం ఆర్డీవో ఉత్తర్వులు జారీ చేశారని, ఈ క్రమంలో ఆ సర్వే నెంబర్ల పరిధిలోని కమలానగర్, ఆంధ్రకేసరినగర్ కాలనీలలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని అన్నారు. దీంతో భయాందోళనకు గురైన కాలనీల ప్రజలు తనను ఆశ్రయించగా న్యాయపరమైన అంశాలను ఆర్డీవోకు వివరించగా రిజిస్ట్రేషన్ల నిలుపుదలపై స్టేటస్ కో ఎత్తివేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారని మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



ఓపెన్‌జిమ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: రాజకీయాలకు అతీతంగా ఎల్‌బీనగర్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర పరిధిలోని శివంహిల్స్‌కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్, పార్కులో బోర్‌వెల్ పంపుసెట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శివారు ప్రాంతాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యలను దశలవారీగా పరిష్కరించానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు పోచబోయిన జగదీష్‌యాదవ్, జక్కిడి రఘువీర్‌రెడ్డి, అనిల్ కుమార్, రామచంద్రారెడ్డి, నర్సింహ్మాగౌడ్ శ్రీకాంత్, కాలనీవాసులు శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లింగారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

## చిల్లర రాజకీయాలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్‌బీనగర్: నియోజకవర్గంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినా వాటికి మళ్లీ కార్పొరేటర్, ఎమ్మెల్యే, ఎంపీ శంకుస్థాపనలు చేయడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత భీమిడి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మన్సూరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క పనికి పోటాపోటీగా బీఆర్ఎస్, బీజేపీ నేతలు శంకుస్థాపనలు చేస్తూ కాలనీవాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ప్రజాప్రతినిధులు హుందాగా వ్యవహరిస్తూ సమన్వయం చేసుకుని కార్యక్రమాలు నిర్వహించుకోవాలని, ఎల్‌బీనగర్‌లో కొత్త సంస్కృతికి తెరలేపడం బాధాకరమన్నారు. ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఉండి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నర్సింహారెడ్డి, ఎర్ర మహేందర్, సర్వేష్, రవికుమార్, భాను పాల్గొన్నారు.

## సంకల్పసభకు తరలిన బీజేపీ నేతలు



సభకు తరలివెళ్తున్న బీజేపీ నేతలు



సభకు బయలుదేరుతున్న బీజేపీ నాయకులు

ఎల్‌బీనగర్: ప్రధాని మోదీ పాలన 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సికింద్రాబాద్‌లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నిర్వహిస్తున్న సంకల్పసభకు బీఎన్‌రెడ్డినగర్ నుంచి బీజేపీ నేతలు తరలివెళ్లారు. కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా నుంచి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్ రావు తదితరులు పాల్గొన్నారు.

**కొత్తపేట, నాగోలు నుంచి..**

నాగోలు: కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్, నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, బీజేపీ నాగోలు డివిజన్ అధ్యక్షులు వంగా శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ నాయకులు సంకల్పసభకు తరలివెళ్లారు.

**చైతన్యపురి నుంచి..**

చైతన్యపురి: చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా ఆధ్వర్యంలో డివిజన్ నుంచి నగరంలో జరిగిన సంకల్ప యాత్రకు బీజేపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. మూసీ పరీవాహక ప్రాంత నివాస బాధితులు, నాయకులు, కార్యకర్తలు సాయినగర్ శివాజీ చౌక్ నుంచి ర్యాలీగా వెళ్లారు.

## పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు



మాట్లాడుతున్న విజయసింహారెడ్డి

మలక్‌పేట: పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు తప్పక గుర్తింపు ఉంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్ అన్నారు. బూత్, డివిజన్, బ్లాక్ కమిటీల ఏర్పాటు ప్రక్రియలో భాగంగా ఆదివారం మూసారంబాగ్ డివిజన్‌లో నిర్వహించిన మలక్‌పేట నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన, పార్టీ పరిశీలకులు సుబ్రహ్మణ్యప్రసాద్, సీనియర్ నేత మందడి విజయసింహారెడ్డి, మలక్‌పేట ఇన్‌చార్జి షేక్ అక్బర్‌తో కలిసి హాజరై మాట్లాడారు. డివిజన్ల వారీగా కార్యకర్తలు వివరాలు సమీకరించామని, వాటిని పార్టీ అధిష్ఠానానికి అందజేస్తామన్నారు. పార్టీ కార్యక్రమాలు విజయవంతం చేసే దిశగా పని చేయాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలందరికీ చేరేలా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఈ సమావేశంలో ఏజాజ్‌ఖాన్, బద్దం సురేందర్‌రెడ్డి, అశ్వక్‌ఖాన్, బట్టుదాసురావు, శ్యామ్‌రావు, కిరణ్‌కుమార్, ధర్మేందర్, బొట్టు శ్రీను, చందునాయక్, సుదర్శన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సీపీఐ పోరాటం



మాట్లాడుతున్న షేక్ మహమూద్

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలో నివసిస్తున్న గుడిసెవాసులకు ఇళ్ల పట్టాలు సాధించేందుకు సీపీఐ పార్టీ పోరాడుతుందని డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్ అన్నారు. ఆదివారం సింగరేణి కాలనీలోని గిరిజన సమాఖ్య భవనంలో సీపీఐ ఐఎస్‌సదన్ డివిజన్ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి కాలనీ సహా పలు బస్తీలు, మురికివాడల్లో ఇప్పటికీ తాగునీటి పైప్‌లైన్లు కానీ, విద్యుత్ మీటర్లు కానీ లేవన్నారు. బస్తీల్లో మౌలిక వసతులు కల్పించాల్సి ఉన్నా ఆయా విభాగం అధికారులు విస్మరిస్తున్నారని ఆరోపించారు. నిరుపేదల సమస్యల పరిష్కారానికి సీపీఐ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఛాయాదేవి, శంకర్‌నాయక్, సక్రిబాయి, దశరథ్, రాజు, నాయక్, అంజయ్య, అమీనా, నర్సింగ్‌రావు, వంశీ, సుదర్శన్, అజయ్ పాల్గొన్నారు.

## బీసీల చైతన్యమే మాస్ లక్ష్యం



జెండా ఆవిష్కరణలో నర్సింగ్‌రావు

నాగోలు: పార్టీలకు అతీతంగా బీసీల చైతన్యమే లక్ష్యమని మన ఆలోచన సాధన సమితి (మాస్) రాష్ట్ర అధ్యక్షులు కటకం నర్సింగ్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం మాస్ మొదటి రాష్ట్ర కార్యవర్గ సమావేశం నాగోలులోని మాస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్ జెండా ఆవిష్కరణ చేసి నూతన కార్యవర్గ సభ్యులకు గౌరవ అధ్యక్షులు గడ్డం నరసింహ గౌడ్, దొంత ఆనందం, పూస నరసింహ బెస్త, నేరెళ్ల దేవేందర్‌తో కలిసి నూతన రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కటకం నర్సింగ్ రావు మాట్లాడుతూ.. గ్రామాల్లో అనైక్యతగా ఉన్న బీసీ (కుల వృత్తులు చేసుకునే) కులాలు మధ్య సఖ్యత, సామాజిక, ఆర్థిక, రాజకీయ, చైతన్యం తీసుకురావడానికి మాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నెల రోజులపాటు మొదటి విడత గ్రామబాట కార్యక్రమాన్ని నిర్వహించి తెలంగాణ వ్యాప్తంగా 37 నియోజకవర్గాలలో, 135 గ్రామాలు మండలాలలో మున్సిపాలిటీలలో నియోజకవర్గ కేంద్రాలలో మాస్ జెండాలను ఆవిష్కరించిన సభ్యులను అభినందించారు. రెండో విడత గ్రామబాట కార్యక్రమం గురించి రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో ఆంజనేయులు గౌడ్, విద్యాసాగర్ ముదిరాజ్, దుర్గారాణి రజక, పంతంగి విటలయ్య గౌడ్, శ్రీనివాసులు యాదవ్, గోదా మల్లికార్జున్ గౌడ్, రమాదేవి, శ్రీ గాది కృష్ణయ్య నాయీ, పన్నీరు సత్యం పూసల, వట్టిపల్లి వెంకటేష్ రజక, నక్క కాశీనాథ్ నేత పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515
9912220363
9912220365